# అద్దెకు ఇవ్వబడును

టి.కుమార్ ప్రభురెడ్డి



"హాల్లో సోఫాలో కూర్చొని పేపరు చూస్తున్న రంగారెడ్డి తలుపువద్ద చప్పుడు కావటంతో తలెత్తి చూశాడు. కూతురు సవిత చేతిలో పుస్తకాలతో తలవంచుకొని మేడ మెట్లు వైపు వెళుతోంది. ఈరోజు ఏం జరిగిందో! అనుకుంటూ పేపరు అక్కడే వదిలేసి తనూ మేడమెట్లు వేపు దారితీశాడు రంగారెడ్డి

తన గదిలోకి వచ్చిన సవిత పుస్తకాలు టేబులు మీద పడేసి వ్యధతో మంచంలో వాలింది. జరిగిన సంఘటన మరచి హృదయ భారం తగ్గించుకొని ఎంత ఆనందంగా వుందామని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చదువు మానేసి ఇంట్లో వుంటేనో, నాన్న ఊరుకోడు, సముదాయించి కాలేజి వరకు వచ్చి దిగ బెడతాడు. ఎన్నో మాటలు చెబుతాడు. తనేమో మెతక మనిషి. హేళన సహించలేదు అల్లరి భరించ లేదు, ఇతరులు తనగురించి ఏచిన్న మాటన్నా తనకు చెప్పరానంత బాధ కలుగుతుంది 'భగవాన్! నన్ను ఇంత మెతకగా ఎందుకు సృష్టించావయ్యా' అనుకుంది మనసులో వేదనగా.

కాలేజీలో జరిగిన సంఘటన, కాలేజీనుండి తను ఇంటికి వస్తుండగా త్రోవలో విన్నమాటలు, ఎంత వద్దనుకున్నా మాటిమాటికి జ్ఞాపకానికి వస్తున్నాయి. కళ్ళముందు కదులుతున్నాయి, చెవుల్లో మారు మ్రోగుతున్నాయి...

...ఒంటరిగా తలవంచుకొని వెళ్ళటం, చెప్పిన పాఠాలేవో జాగ్రత్తగావిని కాలేజి వదలగానే తల వంచుకొని ఇంటికి రావటం తనకలవాటు. అలాగే ఉదయం కూడా మామూలుగ కాలేజికి వెళ్ళింది. మొదటిపీరియడు కాగానే రెండవపీరియడు కెమిస్ట్రి వుంది. లెక్చరర్ రాలేదు అందుచేత లైబ్రరీకి వెళ్ళి ఏదైనా చదువుకుందామని క్లాసుబయటికి వస్తుంది తను. తలుపుబయటె నలుగురైదుగురు అబ్బాయిలు నిల్చుని అస్కా కొడుతున్నారు. తను బయటికిరాగానే తమ వాక్చమత్కృతి ప్రదర్శించటం మొదలుపెట్టారు వారు.

'అందం బాగానే వుందికాని అందానికితగ్గ అలంకరణలేదు. అభినయ చాతుర్యం అసలులేదు. అలంకరించుకుంటేసరి. అప్సరసలనే తలదన్నగలదు" అన్నాడు. ఇలాటి మాటలే మాట్లాడి తన క్లాస్‌మేట్ చరిత చెప్పుచేత చెంప దెబ్బలు తిన్న శంకర్. కాని, తనకు అంత ధైర్యంలేదు. మగవాళ్ళను నిలదీసి ఎదిరించి మాట్లాడే శక్తి తనకులేదు. తను అంత తెగువ చూపలేదు అందంగా వుండటంకూడా తన తప్పేనా!

"ఒంపు సొంపులు తిరిగిన ఆమె మేను బంగారు తీగకన్నా మిన్నగా వుందిరా" అన్నాడు రెండవ వాడు.

"జడలో తురిమిన గులాబీని చూస్తుంటే నాకు లేని భాగ్యం దానికి దొరికిందికదా అని నాకు ఈర్ష్య కలుగుతుంటుందిరా!" అన్నాడు వేరొకడు.

"నాకైతే ఆమె రోజూ ధరించే నుదుటి కుంకుమనై నిలిచిపోవాలనిపిస్తోందిరా!" అన్నాడు మరొకడు.

"నాకేమో! ఆ నడుము వంపుల్లో, నడక సొంపుల్లో నిలచి నాట్యమాడాలనిపిస్తుందిరా." అన్నాడు నాల్గవవాడు.

"ఆంజనేయుని ఎదలో శ్రీరామచంద్రుడు నిలిచి పోయినట్టుగా నేను ఆఎదలో నిలవాలనిపిస్తున్నదిరా" అన్నాడు ఐదవవాడు.

"కోయిల కంఠంతో ఓ కమ్మని పాట విని పించవే కోమలీ" అన్నాడొకడు...

తను కమ్మగా పాడగలుగుతుంది. తన గొంతులో తీయదనముంది. ఈ సంగతి తెలిసిన తన క్లాస్‌మేట్ రాధ బలవంతం చేయగా తప్పనిసరై ఒకసారి కాలేజి "డే" ఫంక్షనలో తను పాడింది. తను పాడ గలగటమే పొరబాటా? తన గొంతులో తీయదన ముండటమే తప్పా!!...

"కడగంట ఒకసారి చూడవే చిలికి" అన్నాడు వేరొకడు.

"సవితా ముజే ఇత్‌నా మత్ సతా" ఒకడు తనకు రాష్ట్ర భాషపై గల అభిమానాన్ని బయట పెట్టాడు.

"సదా తలవంచుకొనే నడుస్తావ్ ఏ తల అలాగే

వుందా తరుణీ' అన్నాడు మరొకడు.

"నా పైన నీకు కోపమా! కా దేవి విరహ తాపమా" అన్నాడు ఒకడు రాగ యుక్తంగా.

వాళ్ళ మాటలు విన్న తనకు పట్టరానంత కోపం వచ్చింది. వాళ్ళను తనకని తీరా తిట్టాలనుకుంది: కొట్టాలను కుంది.

కాని :—

తన దగ్గర అంత ధైర్యం లేదు. తను తెగువ గలదికాదు. అందువల్ల ఏడుపొచ్చేసింది. అక్కడే తనివితీరా ఏడవాలని పించింది. కాని అది తీరికగా కూర్చుని ఏడవ ఏడవ తగిన స్థలంకాదు ఇంటికివచ్చే యాలని పించింది. కాని మధ్యలో పిరియడులు ఎగ్గొట్టి వచ్చే అలవాటు తనకు లేదు.

కాలేజి వదలగానే బస్సుస్టాప్ దగ్గరికి వచ్చి నిలబడింది. అక్కడా అదేగొడవ ఒకడు కావాలని రాసుకుంటూ పోతాడు. మరొకడు అదోవిధంగా చూస్తాడు. వేరొకడు వెకిలి వేషాలేస్తాడు. ఇకిలిస్తారు పకిలిస్తారు, నానా హంగమా చేస్తారు.

సాప్ దగ్గర ఇద్దరు యువకులు తనప్రక్కనే నిలబడి యున్నారు, ఒకడు తనను చూస్తూ చిన్నగా నవ్వుతూ లొట్ల వేశాడు.

రెండవవాడు తనస్నేహితుడిని అడిగాడు "ఏరా! చూసే అంతగా ఆనందపడుతున్నావ్ ఏం లభించిందని."

నవ్వినవాడు సమాధానమిచ్చాడు "తాకితేనే ఆనందపడాలా బ్రదర్! ఎంజాయ్ రెండురకాలు. ఒకటి మెంటల్. రెండవది ఫిజికల్. ఇప్పుడు నేను మెంటల్ ఎంజాయ్ ఫీలవుతున్నాను. తరువాత తరువాత ఫిజికల్ ఎంజాయ్ కూడా పొందవచ్చు. భగవంతుడు దయతలిస్తే. ఈదేవి కరుణిస్తే' చివరి మాటను అదోవిధంగా పలుకుతూ.

ఇద్దరు బిగ్గరగా నవ్వుకున్నారు.

"మేనర్‌లెస్ క్రీచర్స్" అని మనసులో తిట్టుకుంటూ తను అప్పుడే వచ్చిఆగిన బస్సులో ఎక్కేసింది. ఆ యువకులు "టా." "టా." "బై." "బై." అంటున్నారు.... ..

తలుపు వద్ద చప్పుడు కావటంతో గతంలోనుండి ప్రస్తుతంలోకి వచ్చిన సవిత, తండ్రి తన గదిలోకి వస్తుండటము చూసి లేచి కూర్చుంది. రంగారెడ్డి మెల్లగావచ్చి కూతురి ప్రక్కన మంచంలో అసీనుడై ఆమె ముఖాన్ని పరిశీలనగా చూస్తూ "ఏం! జరిగిందమ్మా? అన్నాడు.

"నేను రేపటినుండి కాలేజికి వెళ్ళను నాన్నా" అంది కోపంగా.

ఎందుకమ్మా ఏం జరిగింది" అన్నాడు తండ్రి ప్రేమగా కూతురి తల నిమురుతూ.

"కొత్తగా ఏం జరుగుతుందినాన్నా రోజూ జరిగే అల్లరే. ఆ కాకుల మూక మధ్య నేను తిరగలేను" అంది బాధగా.

"ఎందుకమ్మా అంత బాధ పడ్తావ్. కొంచెం ధైర్యం వహించాలి. తెగువ చూపాలి. ఎవరైనా ఏమన్నా అంటే నాల్గు దీవాల్సియాలి. అంతేగాని ఇలా కాలేజికి వెళ్ళనంటే మనచదువు పాడయి పోతుంది. వారికేం నష్టం? నిన్ను కాకపోతే మరో అమ్మాయిని ఏడిపిస్తారు."

"నువ్వేమైనా చెప్పు నాన్న! నాకంత ధైర్యం లేదు. నేనలా చేయలేను. అలాటిపని నాకు చేత కాదు."

"ఎంత అమాయకురాలవమ్మా. బి యస్సీ చదువుతున్నావ్. మరి ఇంత మెతకగావుంటే ఎలా బ్రతుకుతావమ్మా! ఇంకో మూడునెలలు ఓపికపడితే పట్టా వస్తుంది. ఇంత పిరికితనం పనికిరాదు తల్లీ తమ్ముణ్నే చూడు వాడు నీ కన్నా ఆరేళ్ళు చిన్నవాడు. కాని - మాటల్లో నన్నే ఓడిస్తాడు." అన్నాడు ధైర్యం చెబుతూ. వెన్ను నిమురుతూ.

"వాడికేం మగవాడు. ఎలావున్నా చెల్లుతుంది." అందామె ఉబికివచ్చే కన్నీటినాపుకోవడానికి ప్రయత్నిస్తూ.

"పిచ్చితల్లీ! ఈరోజుల్లో మగవాడికి అధిక్యత నిచ్చి మాట్లాడితే అమ్మాయిని నిన్నొక్కదాన్నే చూశాను. ఆడవాళ్ళు అన్ని పనులు చేస్తున్నారు' ఈతకొడుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. అన్నింటా ముందంజ వారిదే! నీవు మరీ ఇంతగా బేలగావుంటె ఎలా తల్లీ! అన్నాడు అక్కున చేర్చుకొని కన్నీటిని తుడుస్తూ. సవిత చిన్నపిల్లలా తండ్రి ఒడిలో తలవుంచుకొని ఉపశమనం పొంద సాగింది.

బాధతో బరువెక్కిన హృదయభారం తగ్గటానికి ప్రేమ నిండిన ఉపశమన వాక్యాలు ఆప్యాయతతో పొదువుకునే చల్లని ఒడికావాలి.

* * *

సంజీవరెడ్డీ ఇలా రా!" పిలిచాడు రంగారెడ్డి.

"ఏమిటి నాన్నా" అంటూ వచ్చాడు సంజీవరెడ్డి,

"ఏం చేస్తున్నావ్?"

"ఏమిలేదు నాన్నా."

"అయితే 'అద్దెకు ఇవ్వబడును' అని తెలుగులో మరియు ఇంగ్లీషులో ఒక కాగితంమీద వ్రాసి. అట్టకు అతికించి బయట గేటువద్ద తగిలించు. ఈ ప్రక్కనున్న రెండు గదులు ఇచ్చేద్దాం"

"అలాగే నాన్నా!" అని అక్క గదిలోకి వెళ్ళాడు సంజీవరెడ్డి. డాఫీగా కుర్చీలో కూర్చుని రికార్డు బుక్‌లోనుంచి ఒక పేపరు చించి గీతలుగీసి 'అద్దెకు ఇవ్వబడును' అని తెలుగులో 'టు లెట్' అని ఇంగ్లీషులో ముందు పెన్సిలుతో వ్రాసి, కలర్ బాక్సుతీసి బ్రష్‌తో అందంగా అక్షరాలలో రంగులు నింపాడు. తరువాత కాగితాన్ని కుర్చీమీద బోర్లావేసి కాగితమంతా జిగురు పూశాడు. అట్టకోసం గది అంతా వెతికాడు. కాని అట్ట కనిపించలేదు. అట్టకోసం క్రిందికి వెళ్ళాడు...

కాఫీ టిఫెను ముగించి తన గదిలోకి వచ్చిన సవిత ఆత్రంగా గడియారం చూసుకొంది. ఎనిమిదిన్నరయింది. గబగబా బట్టలు మార్చుకొని కుర్చీలో కూర్చుంది. జడలు నొక్కుగులాగి టైం టేబులు ప్రకారము పుస్తకాలు తీసుకొని బయటకు నడిచింది.

అరగంట తరువాత అట్ట వెతుక్కొని వచ్చిన సంజీవరెడ్డి కుర్చీమీద కాగితం కోసం చూశాడు. అది అక్కడలేదు. గది అంతా వెదికాడు కనిపించలేదు. గాలికి ఎగిరి క్రిందగాని పడిందేమో అని చూడటానికి మేడదిగి వెళ్ళి పెరడంతా గాలించాడు. ఎంత గాలించినా కనిపించలేదు. ఇంట్లోకి తిరిగి వస్తుండగా తండ్రి అన్నాడు. "ఏరా! ఎక్కడికి వెళ్ళి వస్తున్నావ్' అని.


"మీరు చెప్పినట్లు కాగితంవ్రాసి జిగురుపూసి అక్కగదిలో కుర్చీమీదపెట్టి అట్టకోసం క్రిందికి వచ్చాను నాన్నా. మళ్ళీ వెళ్ళిచూస్తే కనిపించలేదు. గాలికిగాని కిటికీలోనుండి పెరట్లో పడిందేమోనని చూసి వస్తున్నాను" అని మరల గదిలోకివచ్చి వేరే కాగితం తీసుకొని వ్రాయటం మొదలుపెట్టాడు.

టైం అయిపోయిందన్న తొందరతో తలవంచుకొని గబగబా బస్సుస్టాప్ చేరుకుంది సవిత బస్సులు రావటంలేదు. పది పన్నెండుమందిగల రౌడీమూక ఆమెను చుట్టివేసింది. సవిత వాళ్ళందరివైపు బిక్కుబిక్కుమంటూ చూడసాగింది.

"ఒకరోజుకి అద్దెంత?" అన్నాడొకడు.

"అద్దె రోజూరోజు చెల్లించాలా?" లేక "నెలది ముందే అడ్వాన్సు చెల్లించాలా?" మరొకడు?

"అద్దెపుచ్చుకోవడానికి ఏమైనా నిబంధన



లున్నాయా?" వేరొకడు.

"సరుకు తాజాయేనా? పైన పటారం సామెత గాదా?"

"ఎలాగైనా పరవాలేదురా! కొబ్బరిలాకొరుక్కు తినొచ్చు"

"ఇంత మంచి సరుకు అద్దెకు దొరుకుతుం దంటేనే అదృష్టం"

"నవ నవలాడే శరీరాన్ని నమలకుండా మింగ వచ్చు"

ఇలా నలుగురు నాలుగు రకాలుగ అంటూ ఆమెను వేధించసాగారు. చుట్టూజనం బాగా గుమి గూడారు. పదుల సంఖ్య వందల్లోకి మారింది. వాళ్ళ మాటలకి అర్థం తెలియక వేటకాని వలలో చిక్కిన లేడిలాగ చుట్టూ వున్నవారివేపు ఒకసారి జాలిగా దీనంగా చూసిందామె. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగి చెంపల మీదుగా క్రిందికి జారుతున్నాయి.

అప్పుడే అక్కడికి వచ్చి ఆ దృశ్యంచూసిన ఒక ముసలాడు మందిని త్రోసుకుంటూ సవిత దగ్గరకి వచ్చి "ఎందుకమ్మా "ఏడుస్తున్నావ్" అన్నాడు. సవిత నోటమాట పెకిలి రాక చూపుల తోనే చుట్టూ గుమిగూడిన వారిని చూసింది.

"ఎందుకు అమ్మాయి నేడ్పిస్తున్నారు' అన్నాడు ముసలాడు చుట్టూవున్న రౌడీ వెధవలను దబా యిస్తూ.

"మేమెందుకు ఏడ్పిస్తున్నాం ఉన్నమాటేఅడుగు తున్నాం" అన్నాడు ఒక దుర్ర కుంక ధీమాగా.

"ఏమిటి ఉన్నమాట?" అన్నాడు ముసలాడు కోపంగా.

"అద్దెకు ఇవ్వబడును" అని కాగితం తగిలించు కుంటే అద్దె ఎంతో అడుగుతున్నాం. కావాలంటే ఆమె వెనకాల చూడు. అన్నాడొకడు బింకంగా.

సవిత తల వెనక్కి త్రిప్పి ఒకసారి తన వెనుక భాగం చూసుకొంది, 'అద్దెకు ఇవ్వబడును" అన్న తెలుగు అక్షరాలు "టులెట్" అన్న ఇంగ్లీషు అక్ష రాలు రంగుల్లో వున్నకాగితం తన పిరుదులకు అంటుకొని ఉండి కనిపించింది

హతాశురాలైంది ఆమె, ఆమె తనువులో అణు వణువూ అగ్నికణంలా తయారయింది అంతరంలో అగ్ని పర్వతాలు బ్రద్దలయ్యాయి. వేయి సముద్రాల బీభత్సపు ఘోష లేచింది. కళ్ళు తిరిగాయి. కాగి తాన్ని చించివేసుకోవాలన్న ధ్యాసకూడా లేకుండా ఒళ్ళు తెలియని స్థితిలో తూలుతూ ఇంటివైపు బయలుదేరింది

* * *

రోజూ సమయం ఆరుగంటలకే క్రిందికివచ్చే కూతురు ఎనిమిదయినా రాకపోవడముతో రంగారెడ్డి మేడమీది కూతురు గదిలోకి వెళ్ళారు. మంచం ఖాళీగావుంది ఒక్క క్షణం స్తంభించాడయన టేబిలుమీద పేపరు వెయిటుకింద ఒక కాగితం రెప రెపలాడుతుంది, గబగబా టేబిలు దగ్గరకెళ్ళి కాగితాన్ని చేతిలోకి తీసుకున్నాడు. కళ్ళు అక్షరాల వెంట పరుగెత్తసాగాయి.

'ప్రియమైన నాన్నగారి పాదపద్మాల సన్నిధిని సవిత నమస్కరించి వ్రాయునది:

మీరు ఉదయం నాకోసం గదిలోకి వస్తే మీకు ఖాళీ మంచం కనిపిస్తుంది. నేను పెరట్లోని బావిలో శాశ్వతంగా నిద్రిస్తుంటాను. నిన్న ప్రొద్దంతా ఒంట్లో బాగులేదని గదిలో పడుకున్నందుకు ఒక కారణముంది. అది నిన్న మీరు అడిగితే చెప్ప లేను. కాని ఇప్పుడు చెబుతాను. నేను నిన్న కాలేజికి వెళుతుండగా బస్‌స్టాప్‌వద్ద రౌడీమూక నన్ను చుట్టి తమ ఈలెట్ మాటలతో వెక్కి రించసాగింది. వారు అన్న మాటలు కాగితంమీద వ్రాయలేను. ఒక ముసలాయన వారిని కారణ మడిగితే నన్ను వెనక్కి చూసుకోమన్నారు. నేను వెనక్కి తిరిగి చూసుకుంటే పిరుదులమీద "అద్దెకు ఇవ్వబడును" టులెట్" అన్న అక్షరాలు రంగుల్లో వున్న కాగితం అతుక్కొని వుండి కనిపించింది. హతాశురాలనయ్యాను. నా కాళ్ళ క్రింద భూమి కంపించినట్టయింది. ఆ కాగితం నా పిరుదుల కెలా అతుక్కు పోయిందో తెలియదు. మరుగుతున్న మనసుతో బ్రద్దలవుతున్న గుండెలతో ఒళ్ళు తెలియని స్థితిలో ఇంటికి చేరుకున్నాను. రోజంతా తీవ్రంగా ఆలోచించాను. అవమానం భరించి బ్రతికేకన్నా ఆత్మహత్య మేలనిపించింది. అందుకే శాశ్వతంగా ఈ లోకంనుంచి సెలవు తీసుకుంటున్నాను. నా మరణం మీ కెంత బాధ కలిగిస్తుందో నాకుతెలుసు, అవమానం భరించి తలెత్తుకొని తిరిగే శక్తి నాకు లేదని మీకు తెలుసు.

కూతురుగా మీ నుంచి ఎన్నో సౌఖ్యాలందు కున్నాను. ఎంతో ప్రేమను ఆప్యాతను పొందాను కాని మీకు సేవ చేయకుండానే ఋణపడి వెళ్ళిపో తున్నాను. మళ్ళీ జన్మంటూ వుంటే మీ కూతురు గానే పుట్టించమని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. తమ్ముణ్ని జాగ్రత్తగా కనిపెట్టి వుండండి. ఇక సెలవు తీసుకుంటాను.

మీ ముద్దుల కూతురు
సవిత.

ఉత్తరం ముగించిన రంగారెడ్డి కళ్ళవెంట అశ్రువులు రాలలేదు, నోట మాటరాలేదు మెదడు మొద్దుబారి అచేతనంగా చేష్టలుదక్కి అలాగే విల బడిపోయాడు. అప్పుడే గదిలోకి వచ్చిన సంజీవరెడ్డి తండ్రి వాలకం గమనించి గాబరాగ ఆయన చేతిలో కాగితంలాక్కొని గబగబాచదివి - "అక్కా - నీ చావుకు కారణము నేను" అంటూ గావుకేకపెట్టి పెరటి బావివేపు పరుగెత్తాడు.

★

అంకితము

అమాయకత్వంతో ఆత్మహత్య చేసుకున్న అభా గినికి - అశ్రువులతో ...

—రచయిత.


## పాఠకులకు శుభవార్త!

వచ్చే వారం నుండి కొత్త సీరియల్

వర్ధమాన రచయిత

శ్రీ కొనసనం మహేశ్వరరావు

రచించిన నవల

# "రాధ"

ప్రభుత్వం వయోజన విద్యకు సంబంధించిన అంశంపై నిర్వహించినపోటీల్లో, ఈ రచయిత రచించిన "గ్రామ రాజ్యం" నకు 1969 లో బహుమానం లభించింది.